## క్లుప్తంగా

### ఎమ్మెల్యే చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

**ఆత్మకూరు:** ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో పట్టణంలో 19వ వార్డులో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అయితే దానిపై అధిక భారం పడుతుండడంతో స్థానికంగా తరచూ విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న కౌన్సిలర్ కొండా స్వరూపరాణి, ఎస్సీ సెల్ నాయకుడు వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఏపీ ట్రాన్స్‌కో డీఈ, ఏడీఏలతో మాట్లాడి 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.

### తెల్లరాయి తరలించే లారీ బోల్తా

**ఆత్మకూరురూరల్ (మర్రిపాడు):** తెల్లరాయిని తరలించే లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన మండలంలోని నందవరం సమీపంలో మంగళవారం వేకువజామున జరిగింది. అయితే తెల్లవారే సరికల్లా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన తెల్లకంకరను గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో తొలగించడంతో రాకపోకలకు అడ్డంకులు తొలగాయి. ఘటనా స్థలంలో వాహనానికి సంబంధించిన వారెవరూ అందుబాటులో లేకపోవడంతో ఇతర వివరాలు తెలియరాలేదు. పోలీసులకు ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిసింది.

### నాలుగేళ్ల పాలనపై హర్షం


వింజమూరు బంగ్లా సెంటర్‌లో సంబరాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**ఆత్మకూరు:** రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆత్మకూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకం అందడం కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే సాధ్యపడిందన్నారు.

**కలిగిరి:** కలిగిరి సచివాలయం ఆవరణలో ప్రభుత్వం ఏర్పాటయ్యి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. పంచాయతీ వార్డు సభ్యులు వేమనారాయణ, రవి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబుల్‌రెడ్డి, శ్రీను, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

**వింజమూరులో..**

**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరు బంగ్లా సెంటర్‌లో మంగళవారం రాత్రి వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టి నాలుగేళ్లయిన సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసి దేశంలోనే ఉత్తమ ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గువ్వల కృష్ణారెడ్డి, మద్దూరు చిన్నికృష్ణారెడ్డి, జూపల్లి రాజారావు, మద్దూరు బాబు, రేవునూరు శ్రీనివాసులురెడ్డి, తదితరులున్నారు.

### పేద కుటుంబానికి చేయూత

**అనుమసముద్రంపేట:** మండలంలోని గుంపర్లపాడులో ఓ పేద కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నేత ఆర్థిక సహాయాన్ని అందించారు. రెండు రోజుల క్రితం గాలివానకు గ్రామానికి చెందిన ఖాజారహమతున్నిసా ఇంటి రేకులు ఎగిరిపోవడంతో ఆ కుటుంబం నిరాశ్రయులైంది. దీంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నేత సిరిగిరి వెంకటేశ్వర్లురెడ్డి నగదు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

**అనుమసముద్రంపేట:** మండలంలోని చిరమన పీహెచ్‌సీ పరిధిలోని కావలియడవల్లిలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ జ్యోతిరాణి రోగులను పరీక్షించి మందులను అందజేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజలకు దోమల వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట వైద్యసిబ్బంది ఉన్నారు.

### సచివాలయాల్లో సత్వర సేవలు అందాలి

**ఆత్మకూరురూరల్:** ప్రజల నుంచి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సచివాలయాల సిబ్బంది సత్వర సేవలు అందించాలని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బోయలచిరివెళ్ల సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సంక్షేమ పథకాల ఫ్లెక్సీలను సచివాలయం గోడలపై కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు షఫీ, శ్రీనివాసులు, సంక్షేమ, ఇంజినీరింగ్ సహాయకులు సుబ్బారావు, హరీష్ పాల్గొన్నారు.

# జగన్ నిజం.. చంద్రబాబు అబద్ధం


బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**కావలి:** ఈ నాలుగేళ్ల పాలనలో ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవి, చెప్పనవి అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల్లో బలమైన నమ్మకాన్ని ఏర్పరుచుకున్నారని, అదే చంద్రబాబు తన 14 ఏళ్ల పరిపాలనలో ఏపీ అమలు చేయకుండా చెప్పేవన్నీ అబద్ధాలని అప్రతిష్ట మూట కట్టుకున్నాడని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ సంక్షేమ, అభివృద్ధి పాలనకు నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా పట్టణంలో మంగళవారం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమ సమాజాన్ని నిర్మించే పనిలో భాగంగా అభివృద్ధి, సంక్షేమాన్ని చేతల్లో చేసి చూపిన నేతగా సీఎం జగన్ చరిత్రలో నిలిచారని కొనియాడారు. సీఎం జగన్ నాలుగేళ్లలో ఏం అభివృద్ధి చేశారో, ఎంత సంక్షేమం అందించారో లబ్ధి పొందిన ప్రతి గడపకూ తెలుసునని, అట్టడుగున ఉన్న ప్రజల సంక్షేమం సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా పరిపాలన సాగుతోందన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును నిలబెట్టే విధంగా జగన్ ప్రజలకు సంక్షేమాన్ని అందించారని గుర్తు చేశారు. అందుకే ఏ ఎన్నికలు వచ్చినా జగన్‌ను ప్రజలు ఆదరించడానికి కారణం అదేనన్నారు. చరిత్ర మనకి ఒక అవకాశం ఇచ్చిందని, హామీలు అమలు చేస్తున్నందునే మనం జనంలోకి ధైర్యంగా వెళ్లగలుగుతున్నామన్నారు. అయితే కొన్ని గుంటనక్కలు ఈ సంక్షేమ పాలనను తట్టుకోలేక పోతున్నాయని విమర్శించారు. చంద్రబాబు ప్రజలను మరోసారి మోసం చేయడానికి దత్తపుత్రుడితో కలిసి పొత్తులతో పాచికలు వేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఏపీ ప్రజలే కాదు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కూడా అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఇది అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తూ, ఇచ్చిన మేనిఫెస్టోని తూచా తప్పకుండా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందని కొనియాడారు. చంద్రబాబు మేనిఫెస్టోని అమలు చేయలేక చివరికి దాన్ని కనపడకుండా చేశారని విమర్శించారు. రైతు రుణమాఫీ, డ్వాక్రా రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేసిన మనిషి చంద్రబాబని ధ్వజమెత్తారు. తాజాగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తున్నా అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, కుందుర్తి శ్రీనివాసులు, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, జనిగర్ల మహేంద్రయాదవ్, ఈతముక్కల బాల మురళీరెడ్డి, దండా కృష్ణారెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరు చిన్న పుల్లయ్య, కనుపర్తి రాజశేఖర్, గుర్రం వెంకటేశ్వర్లు, పుల్లా శ్రీనివాసులరెడ్డి, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూముల సర్వేలో బాధ్యత వహించండి

• ఆర్డీఓ కరుణకుమారి


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కరుణకుమారి

**ఆత్మకూరు:** గ్రామాల్లో భూముల వివాదాలపై అర్జీలు వస్తుంటాయని, వాటిని సర్వే నిర్వహించడంపై బాధ్యత వహించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి ఆదేశించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మర్రిపాడు తహసీల్దారు ఆనందరావు, సర్వేయర్ రాధాకృష్ణతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. భూ సమస్యలపై ఆ మండలంలో అందుతున్న ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలని సూచించారు. భూముల రీసర్వే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది డైగ్లాట్ మేరకు పరిశీలించుకుని సర్వే నిర్వహించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా డివిజన్ సర్వేయర్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుభద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

• ఎంపీపీ జయంత్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి

**దుత్తలూరు:** సమస్యల పరిష్కారంపై అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో విద్యుత్ సరఫరా కోసం కరెంట్ స్తంభాలు నాటాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు తన దృష్టికి తెస్తే వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉపాధి హామీ పనులు గ్రామాల్లో విరివిగా చేపట్టాలన్నారు. అవసరమైన వారికి జాబ్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ చేజర్ల చలమారెడ్డి, తహసీల్దార్ సోమ్లానాయక్, ఎంపీడీఓ సాయిప్రసాద్, మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి, డిస్కం ఏఈ వెంకటసుబ్బయ్య, కోఆప్షన్ సభ్యుడు మౌలాలి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో జనరంజక పాలన


కలిగిరిలో కేక్‌కట్ సంబరాలు నిర్వహిస్తున్న ఏపీ స్టేట్ పోలీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి

**కలిగిరి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తూ రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తున్నారని ఏపీ స్టేట్ పోలీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి తెలిపారు. కలిగిరిలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి జగనన్న ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు


వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం


మహేష్‌ను సత్కరిస్తున్న జెడ్పీటీసీ మాల్యాద్రిరెడ్డి

**వింజమూరు (ఉదయగిరి):** వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులని పలువురు ప్రశంసించారు. వింజమూరు ఐదో సచివాలయంలో సేవా మిత్రలుగా ఎంపికైన 21 మంది వలంటీర్లను ఎంపీడీఓ ప్రసన్నకుమారి సన్మానించి ప్రశంసా పత్రాలు అందించారు. సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండి ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొస్తూ పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లగొండ్ల సుజన, పంచాయతీ కార్యదర్శి వి.శీనయ్య, సచివాలయ కార్యదర్శి రమాదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఓంకారం నారాయణ, సచివాలయ కన్వీనర్లు బోజనపు గోపి, షేక్ జిలానీ, అల్లూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**వలంటీర్ల సేవలు ప్రశంసనీయం**

**కలిగిరి:** గ్రామీణ ప్రాంత ప్రజలకు కుటుంబ సభ్యుల్లా సేవలు అందిస్తున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి అన్నారు. కలిగిరి సచివాలయంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవామిత్ర పురస్కారం పొందిన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. సేవారత్న పురస్కారం పొందిన వలంటీర్ మహేష్‌ను అభినందించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు చెంచుకృష్ణారెడ్డి, అశోక్, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**నాగసముద్రం సచివాలయంలో..**

నాగసముద్రం సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవారత్న పురస్కారం పొందిన దొరబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి వెలుగోటి మధు, సర్పంచ్ డి. శ్రీనివాసులు, నాగసముద్రం, వీర్నకొల్లు ఉప సర్పంచులు అక్కెం హజరత్‌రెడ్డి, మూలి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

**చేజర్ల(సోమశిల):** అనంతసాగరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. మంగళవారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గుడిగుంట పంచాయతీ ఎగువపల్లి గ్రామానికి చెందిన సంఘరాజు దశరథరాజు నోటు పుస్తకాలు, పెన్నులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ నారాయణరాజు పాల్గొన్నారు.

### సుబ్బనాచారికి విశ్వకర్మ లెజెండ్రీ అవార్డు


విశ్వకర్మ లెజెండ్రీ అవార్డును అందుకుంటున్న సుబ్బనాచారి

**కావలి:** కావలి పట్టణ, మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పడుగుపాటి సుబ్బనాచారి మంగళవారం విశ్వకర్మ లెజెండ్రీ అవార్డును అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, విశ్వకర్మ లెజెండ్రీ ఫౌండేషన్ వ్యవస్థాపకకు విశ్వనాథులు పుష్పగిరి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. పట్టణంలో వడ్రంగి వృత్తిలో రాణిస్తూ విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు అండగా ఉంటూ అనేక సేవా కార్యక్రమలను నిర్వహిస్తున్న పడుగుపాటి సుబ్బనాచారికి అవార్డు రావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### టోల్‌ప్లాజా వద్ద ఎంవీఐ తనిఖీలు


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఆత్మకూరు ఎంవీఐ రాములు

**ఆత్మకూరురూరల్ (మర్రిపాడు):** మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద 67వ నంబరు జాతీయ రహదారిపై ఆత్మకూరు ఎంవీఐ రాములు మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. 15 వాహనాలకు కాలుష్య నియంత్రణలేని కారణంగా అపరాధ రుసుం విధించారు. సైలెన్సర్ అధికంగా పొగ వస్తున్న కారణంగా ఒక లారీని సీజ్ చేసి అపరాధ రుసుం విధించారు. ఆయన మాట్లాడుతూ వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఉద్యోగుల రిలేనిరాహార దీక్ష



**ఆత్మకూరురూరల్:** తమ ఆర్థిక ప్రయోజనాలు సత్వరం నెరవేర్చాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆత్మకూరు తాలుకా యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఒక రోజు రిలేనిరాహార దీక్షను నిర్వహించారు. ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా, పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ తమ డిమాండ్లను తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగరాజు, శ్రీనివాస్, రాజేష్, ప్రసాద్, రవూఫ్, అపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు అనీల్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

### మండల సమావేశం వాయిదా



**కలిగిరి:** కలిగిరి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షత మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఎంపీడీఓ ఆర్.కళాధర్‌రావు మాట్లాడుతూ పలు కారణాలతో ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరు కాకపోవడంతో కోరం లేక వాయిదా వేస్తున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రి రెడ్డి, వైస్ ఎంపీపీ పొన్నం రాజ్యలక్ష్మి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# గాలివాన బీభత్సం


బిట్రగుంట: తీగలపై పడిన చెట్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది


వింజమూరులో తెగిపడిన విద్యుత్ తీగలు

• పిడుగుపాటుకు గేదె మృతి
• పలుచోట్ల నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
• యుద్ధప్రాతిపదికన చర్యలు పునరుద్ధరించిన విద్యుత్


వరికుటంపాడు: నారసింహాపురం రామాలయంలో విరిగిపడిన ధ్వజస్తంభం


అన్నవరంలో విరిగిపడిన మామిడి చెట్టు


చేజర్ల: బోడిపాడు పెట్రోల్ బంక్ వద్ద పడిన చెట్టు


కొండాపురంలో వర్షం కురుస్తున్న దృశ్యం

**ఉదయగిరి:** నియోజకవర్గంలోని వింజమూరు, వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి, కొండాపురం, జలదంకి, కలిగిరి మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా ఆకాశం మేఘావృతమై గాలులతో కూడిన వర్షం కురిసింది. బలమైన గాలులు వీయడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. కొన్ని చోట్ల వ్యవసాయ పొలాలకు సంబంధించిన విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలిగింది. వింజమూరు ఎంపీడీఓ కార్యాలయం, బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏడు స్తంభాలు నేలకొరిగి విద్యుత్ తీగలు తెగిపోవడంతో సుమారు ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేసి రాత్రికి వింజమూరు పట్టణంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఉదయగిరి మండలం గంగిరెడ్డిపల్లి, వింజమూరు మండలం గుండెమడకలలో పిడుగుపాటుకు గేదెలు మృతి చెందాయి.

**నేలకొరిగిన ధ్వజస్తంభం**

**వరికుంటపాడు:** మండలం నారసింహాపురంలో మంగళవారం వీచిన బలమైన గాలుల ధాటికి రామాలయంలోని ధ్వజస్తంభం విరిగిపోయింది. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం విరిగిపడడంతో గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. వరికుంటపాడు మండలం గొల్లపల్లిలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**పత్తి, మామిడి రైతులకు నష్టం**

**జలదంకి:** మండలంలోని అన్నవరం, కేశవరం, గట్టుపల్లి, రామవరప్పాడు, చోడవరం, చినక్రాక, వేములపాడుల్లో మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి మామిడి, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మామిడి తోటల్లో చేతికందిన ఫలాలు రాలిపోవడంతో నష్టపోతున్నామని రైతులు తెలిపారు. పత్తి పంట కూడా కోత దశలో ఉన్న సమయంలో అకాల వర్షానికి పత్తి తడిసిపోయి నష్టం వాటిల్లినట్లు తెలిపారు. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి.

**ఈదురు గాలులు, చెదురుమదురు జల్లులు**

**బిట్రగుంట:** బోగోలు మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులు కూడిన చెదురుమదురు జల్లులు పడ్డాయి. మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 వరకు గంటపాటు ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రం ఏడు గంటల వరకు కూడా సరఫరాను పునరుద్ధరించలేదు. మామిడి తోటల్లో కాపు నేలరాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

**కొండాపురంలో..**

**కొండాపురం:** మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. కొండాపురం, పార్లపల్లి, అగ్రహారం, కొమ్మి, యర్రబల్లి, తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

**పెనుగాలివాన**

**ఆత్మకూరురూరల్ (మర్రిపాడు):** మర్రిపాడు, ఆత్మకూరు మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై పెనుగాలులు వీయడంతో పాటు మోస్తరు వర్షం కురిసింది. గాలుల ధాటికి పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. మర్రిపాడులో పెనుగాలులతో పాటు భారీ వర్షం కురిసింది.

**రాలిపడిన మామిడికాయలు**

**సంగం:** మండలంలో మంగళవారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో చెట్లు నెలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సంగం, దువ్వూరు గ్రామాల్లో మామిడితోట, అరటి తోటలకు భారీగా నష్టం వాటిల్లింది. మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి.

**గాలివాన బీభత్సం**

**అనుమసముద్రంపేట:** మండలంలో మంగళవారం గాలివాన బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వాతావరణం మార్పు చెందిన మబ్బులు కమ్ముకున్నాయి. ఈదురుగాలులు రావడంతో రోడ్డుపై దుమ్ము దుకాణాల్లో పడడమే కాక కొన్ని పూరిళ్ల కప్పులు సైతం లేచిపోయాయి.

**ఈదురు గాలులతో వర్షం**

**చేజర్ల:** మండలంలో పలు గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుని గాలులతో కూడిన వర్షం కురిసింది. చేజర్ల, ఆదూరుపల్లి, గొల్లపల్లి, చిత్తలూరు తదితర గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో వర్షం కురిసింది. ఈదురు గాలుల ధాటికి పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. బోడిపాడు సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద చెట్టు పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అనంతసాగరం మండలంలో పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. అనంతసాగరం, బొమ్మవరం, చిలకలమర్రి, సోమశిల, మంచాలపల్లి, కామిరెడ్డిపాడు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.


మర్రిపాడులో కురుస్తున్న భారీ వర్షం


రాలిపోయిన కాయలను ఏరివేస్తున్న రైతు

## మాయా మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు

• మెట్టుకూరు ధనుంజయరెడ్డి


మాట్లాడుతున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి

**ఉదయగిరి:** 14 ఏళ్ల చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చిన దాఖలాలు లేవని, తాజాగా మహానాడులో మాయా మేనిఫెస్టోతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్ల అయిన సందర్భంగా మంగళవారం ఉదయగిరి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కర్ణాటకలో బీజేపీ, కాంగ్రెస్ తమ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన అంశాలను కాపీ చేసి తానేదే గొప్ప మేనిఫెస్టోను తెలుగు ప్రజలకు అందిస్తున్నట్లుగా తన ఎల్లో మీడియా ద్వారా చంద్రబాబు డబ్బా కొడుతున్నారన్నారు. 2014 ఎన్నికల్లో 600పైగా హామీలిచ్చి ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయలేదన్నరు. డ్వాక్రా రుణమాఫీతో మహిళలను, పంట రుణమాఫీతో రైతులను, నిరుద్యోగ భృతి పేరుతో యువతను మోసం చేసిన చరిత్ర బాబుదన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి రాష్ట్ర ప్రజలు మరోసారి మోసపోయే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, చేజర్ల చలమారెడ్డి, వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, ఓబుల్‌రెడ్డి, అల్లూరురాజు, ఎంపీటీసీ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

**నల్లగండ్లలో పూజలు**

**వింజమూరు(ఉదయగిరి):** మండలంలోని నల్లగొండ్ల లక్ష్మీనరసింహస్వామిని మంగళవారం ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు మెట్టుకూరు ధనుంజయరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు సత్యనారాయణాచార్యులు ఆయనకు స్వాగతం పలికి పూజలు చేయించారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, వెంగళరెడ్డి, రేణమాల శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

## జగనన్న గృహాలను సద్వినియోగం చేసుకోవాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

**సీతారామపురం:** నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, హౌసింగ్ ఏఈ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని పబ్బులేటిపల్లిలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. జగనన్న ఇంటి నిర్మాణానికి పట్టాలు పొందిన లబ్ధిదారులకు ఇంటికి రూ.1.80 లక్షలు, డీఆర్‌డీఏ ద్వారా రూ.35 వేలు రుణం అందిస్తుందన్నారు. ఇసుక, మెటీరియల్ ప్రభుత్వం అందించి ఇళ్లు కట్టించడంతో అద్దె ఇంటి అవస్థలు తీరుతాయన్నారు. పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగన్నాథం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.